
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
గురువారం 21 మార్చి 2024



సౌర విద్యుత్ పనులు
త్వరగా పూర్తి చేయాలి

గుంతలమయంగా
కోల్‌కారిడార్ రోడ్డు
8లో..





ఊరూరా బెల్ట్‌షాపులు

- జిల్లాలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- 'కోడ్' అమల్లో ఉన్నా పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో ఊరూరా నడుస్తున్న బెల్టుషాపుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బెల్టు షాపులను మూసివేస్తామంటూ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. అయినా ఆచరణకు నోచుకోవడం లేదు. మరోవైపు పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఈనెల 16న కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేయగా, అదేరోజు నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. అయినా కూడా ఇప్పటివరకు జిల్లా ఎక్సైజ్ అధికారులు బెల్టు షాపులను మూసివేయకపోవడం గమనార్హం. ఎక్సైజ్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించినా కూడా సంబంధిత అధికారుల్లో చలనం కానరావడం లేదు. మద్యం అమ్మకాలను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వాలు బెల్టుషాపులకు తెర లేపాయి. బెల్టుషాపుల నిర్వహణ చట్టబద్ధం కాకపోయినా అక్రమంగా షాపులను నడుపుతున్నారు. నిబంధనల ప్రకారం ఒకరి ఇంట్లో 6 ఫుల్ బాటిళ్లకు మించి మద్యం ఉంటే వాటిని సీజ్ చేసి ఎక్సైజ్ అధికారులు కేసులు నమోదు చేస్తారు. కానీ పెట్టెలకు పెట్టెల మద్యం నిల్వచేసి మద్యం విక్రయాలు చేపడుతున్నా కూడా అధికారులు పట్టించుకోకపోవడంతో వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నది.

వందలాది బెల్టు షాపులు..

జిల్లాలో 76 రిటైల్ మద్యం షాపులు ఉండగా, వీటి పరిధిలో వందలాది బెల్టు షాపులు నడుస్తున్నాయి. ఒక్కో గ్రామంలో ఐదు నుంచి 15 వరకు బెల్టు షాపులు నడుస్తున్నాయి. రిటైల్ మద్యం షాపులు ఉన్న గ్రామాల్లో కూడా బెల్టు షాపులను నడిపిస్తున్నారు. రిటైల్ షాపుల యజమానులు బీర్లు, విస్కీ, బ్రాందీ బాటిళ్లను ఎమ్మార్పీకి మించి విక్రయిస్తుండగా, బెల్టుషాపుల యజమానులు ఆ బాటిళ్లపై 5 నుంచి 10 రూపాయలు అదనంగా తీసుకుని విక్రయిస్తు న్నారు. జనవాసాల మధ్యనే మద్యం విక్రయాలు చేపడుతుండడంతో మందుబాబులతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే ఊరూరా బెల్టు షాపులు ఉండవని, అన్నింటినీ తొలగిస్తామని ప్రకటించిన రేవంత్‌రెడ్డి గద్దెనెక్కిన తర్వాత వాటి గురించి పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా ఎక్సైజ్ శాఖాధికారులు కూడా పట్టించు కోవడం లేదు. జిల్లాలో 3 వేలకు పైగా బెల్టు షాపులు అనధికారికంగా నడుస్తున్నాయి. వీటి ద్వారా రోజుకు 10 నుంచి 15 కోట్ల రూపాయల వరకు వ్యాపారం సాగుతున్నది. దీని ద్వారా బెల్టు షాపుల యజమానులు అనతి కాలంలోనే లక్షాధికారులు అవుతున్నారు. ఎక్సైజ్ శాఖాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అసెంబ్లీ, పార్లమెంట్, ఇతరత్రా ఎన్నికలు జరిగినప్పుడు ముందస్తుగా బెల్టుషాపుల నిర్వాహకులను మండల తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేస్తుంటారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలై కోడ్ అమల్లోకి వచ్చి నాలుగు రోజులు గడిచినా కూడా ఎక్సైజ్ శాఖాధికారులు వాటిని మూసివేయకపోవడం విచారకరం. ఈ విషయమై కలెక్టర్ స్పందించి జిల్లాలో విచ్చలవిడి మద్యం అమ్మకాలు సాగిస్తున్న బెల్టు షాపులను మూసివేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

- మంథని ఆర్డీవో హనుమా నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హనుమా నాయక్

మంథని, మార్చి 20: పార్లమెంట్ ఎన్నికల షెడూల్ వెలువడిన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఉండే విధంగా తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలని మంథని ఆర్డీవో హనుమానాయక్ ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంథని నియోజకవర్గస్థాయి రాజకీయ పార్టీ నేతలతో బుధవారం సమీక్ష సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో పెద్దపల్లిలో ఏప్రిల్ 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ జరుగుతుందన్నారు. మే 13న పార్లమెంట్ ఎన్నికలు జరుగుతాయని, జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ఉంటాయన్నారు. మంథని నియోజకవర్గంలోని అన్నిపోలింగ్ కేంద్రాలకు బూత్ లెవెల్ ఏజెంట్లను ఒక్కొక్క బూత్‌కు ఒక ఏజెంట్‌ను పార్టీ నుంచి నియమించాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, నాయకులు, పది మండలాలకు సంబంధించిన తాహసీల్దార్లు, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో యువత ముందుండాలి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, మార్చి 20: క్రీడల్లో గ్రామీణ యువకులు ముందుండాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బుధవారం ధర్మారం మండలం నందిమేడారం గ్రామంలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని చెప్పారు. క్రీడాకారులకు ఏదేని సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, నాయకులు చిప్ప మణిశర్మ, శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అడ్లూరి పూజలు..

మండలంలోని నర్సింహులపల్లి గ్రామంలో ఎల్లమ్మ తల్లి పట్నాల ఉత్సవాల్లో, దొంగతుర్తిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పూజలు చేశారు. దొంగతుర్తిలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పూజలుచేశారు. ఆయనకు అర్చకులు తీర్థ ప్రసాదం అందించారు. మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్లకు ఏర్పాట్లు చేయండి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ ప్రక్రియ కోసం ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన అదనపు కలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న విడుదలవుతుందని, అదే రోజు నుంచి 25 వరకు నామినేషన్‌ల స్వీకరించాలని, 26న పరిశీలన ఉంటుందని, 29 లోపు ఉపసంహరణకు గడువు ఉందన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ నామినేషన్ల సమయంలో పాటించాల్సిన నియమ, నిబంధనలపై ముందస్తుగా రాజకీయ పార్టీ ప్రతినిధులతో అవగాహన సమావేశం నిర్వహించాలన్నారు. నామినేషన్ ఫారంలు ఆన్‌లైన్‌లో, రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని, అభ్యర్థి నూతన ఫోటో, అఫిడవిట్‌తో సహా నామినేషన్ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని, నామినేషన్ సమర్పించే సమయంలో అభ్యర్థికి ఎన్నికల కమిషన్ నిబంధనలు, ఎన్నికల ఖర్చు వివరాలు, రేట్ చార్ట్, ఎన్నికల వ్యయ రిజిస్టర్‌లు, ఓటరు జాబితా సంబంధించిన పూర్తి సమాచారం అందజేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. ప్రతి రోజు వచ్చే నామినేషన్ వివరాలు నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలని, అభ్యర్థుల యొక్క అఫిడవిట్‌ను ఎవరైనా సవాల్ చేస్తూ కౌంటర్ దాఖలు చేస్తే ఆ వివరాలు సైతం నోటీసు బోర్డులో ప్రదర్శించాలన్నారు. నామినేషన్ సమర్పించే సమయంలో అభ్యర్థి తన పేరును బ్యాలెట్ పేపర్‌పై తెలుగులో తప్పనిసరిగా ఎలా రాయాలో తెలియజేయాలని, అక్షరమాల ప్రకారం బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల క్రమ సంఖ్య ఉండాలని అన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సీసీ కెమెరాలు అందుబాటులో ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు పాటించాలన్నారు. నామినేషన్ల స్వీకరణ అంశంపై రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ముందస్తుగా డ్రైరన్ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని, అధికారులు మ్యాన్యువల్స్ పూర్తిగా చదవి ఎన్నికల నిబంధనలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, ఎవరికి పక్షపాతం లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో రామగుండం తహసీల్దార్ కుమారస్వామి, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివరాహ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

కమాన్‌పూర్, మార్చి 20 : మండల కేంద్రంలో ఆదివరహా దేవస్థానంలో సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌రావు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు దండే లక్ష్మీనారాయణ ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.

హుండీ లెక్కింపు

కమాన్‌పూర్, మార్చి 20 : మండల కేంద్రంలోని పుణ్యక్షేత్రమైన ఆదివరాహ స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు బుధవారం జిల్లా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుజాత, ఆలయ కార్యనిర్వహణ అధికారి కోసన కాంతారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఆలయ హుండీ లెక్కింపు గత సంవత్సరం సెప్టెంబర్ మాసంలో లెక్కించగా, ప్రస్తుతం మార్చి మాసంలో నిర్వహించారు. హుండీ ఆదాయం రూ. 5,06,601 వచ్చినట్లు దేవాదాయ శాఖాధికారులు వెల్లడించారు. అలాగే ఒక్క కిలో 20గ్రాముల వెండితోపాటు మిశ్రమ బంగారం 4.7 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. ఈ ఆలయ హుండి లెక్కింపు కార్యక్రమం దేవాదాయ శాఖాధికారులు, పోలీసు సిబ్బంది, భక్తుల పర్యవేక్షణలో నియమ నిబంధనల ప్రకారం నిర్వహించారు.

ఘనంగా దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, మార్చి 20: ఆర్‌జీ-1 సివిల్ డిపార్ట్‌మెంట్ న్యూ ఫిల్టర్‌బెడ్‌లోని శ్రీ దుర్గామాత ఆలయంలో బుధవారం జరిగిన అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాల్లో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, మనాలి దంపతులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు పాల్గొని అమ్మవారిని కార్మికులకు ఆయురారోగ్యాలతో పాటు సుఖసంతోషాలతో పాటు విధి నిర్వహణలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా కార్మికులందరికీ రక్షణగా వారిని కంటికి రెప్పలా కాపాడాలని కోరుకుంటున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే దంపతులకు ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులతో పాటు సింగరేణి యాజమాన్యం ఉద్యోగులు, కార్మికులు, కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో దంత వైద్యుల నియామకానికి కృషి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు


ఉచిత దంత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

సుల్తానాబాద్, మార్చి 20: ప్రతి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో దంత వైద్యులు అందుబాటులో ఉండేలా తాను అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళతానని సిర్పూర్‌కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో తెలంగాణ డెంటిస్ట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మనిషి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలంటే తరచూ దంత వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా చిన్నారులకు చిరుతిళ్ల అలవాటు అధికంగా ఉంటుందని, కాబట్టి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దంత వైద్యున్ని నియమించాలని కోరారు. ఈఅంశం గురించి అసెంబ్లీలో కూడా ప్రస్తావిస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మిరాజమల్లు, వైస్‌ఛైర్‌పర్సన్ బిరుదు సమతక్రిష్ణ, స్కూల్ డైరెక్టర్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, డెంటిస్ట్ అసోసియోషన్ రాష్ట్ర అధ్యక్షుడు మణిదీప్, ఉపాధ్యక్షురాలు శ్రీజ, మహాలక్ష్మి, విగ్నేష్, కౌన్సిలర్లు తది తరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను నిలదీయండి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చందర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని, మార్చి 20: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులైనా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చలేదని, ప్రచారానికి వచ్చే నాయకులు ఈ విషయమై నిలదీయాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు. బుధవారం స్థానిక చౌరస్తాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి హామీలు ఇవ్వడం తప్ప అమలు చేయడం తెలియదని ప్రజలు ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారన్నారు. హామీలను అమలు చేయడం చేతగాక బీఆర్ఎస్ పార్టీ పథకాలనే కొనసాగిస్తున్నారన్నారు. వృద్ధులకు రూ.4వేల పెన్షన్, వికలాంగులకు రూ.6వేల పెన్షన్, కల్యాణలక్ష్మి తులం బంగారం మాటలను ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. ఇప్పటికీ కేసీఆర్ అమలు చేసిన పెన్షన్లు, కల్యాణ లక్ష్మి చెక్కులనే ఇస్తున్నారని, ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పరాభవం తప్పదని అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు నెలకు రూ.2500 అందించే గ్యారంటీని అటకెక్కించి కొత్తగా మహిళలను మోసం చేసి పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేయించుకోవడానికి ఋణాలంటూ, ఇన్సూరెన్స్ అంటూ కొత్తనాటకం మొదలు పెట్టిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులు ఆనందంగా ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం పంటపొలాలకు నీరందక నిరాశతో ఉన్నారన్నారు. ఇక రామగుండంలో గత ప్రభుత్వంలో గ్రాంట్‌అయిన నిధులతోనే అభివృద్ధి జరుగుతుందని, అందుకు సంతోషమని చందర్ అన్నారు. ప్రభుత్వం ఏప్రిల్ 1వ తేదీ నుంచి వడ్లు కొనడం ప్రారంభిస్తామని తెలిపిందని ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటప్రకారం రూ.500 బోనస్‌తో ఇవ్వాలని కోరారు. పాల ఉత్పత్తిపై రూ.5 ప్రోత్సాహకం ప్రకటించాలని, రూ.2680తో వడ్లను కొంటామని మాట ఇచ్చిన ప్రకారం వడ్ల కొనుగోలు చేయాలని కోరుకంటి చందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు మాట్లాడుతూ మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారికి సర్వీస్ రోడ్డు మధ్యలో షాపులను ఏర్పాటు చేసుకోవడానికి గతంలో అవకాశం కల్పించామని, ఇప్పటి ఎమ్మెల్యే షాపులను కూల్చివేయిస్తున్నారని, షాపులను కోల్పోతున్న వారికి వ్యాపారం జరిగే స్థలలో షాపులకు స్థలం ఏర్పాటు చేయించాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు కల్వచర్ల కృష్ణవేణి, కుమ్మరి శ్రీనివాస్, ఎన్వీ రమణారెడ్డి, నడిపెల్లి మురళీధర్‌రావు, మెతుకు దేవరాజ్, గాదం నందు, సత్యప్రసాద్, బొడ్డు రవీందర్, జాహిద్ పాషా, నూతి తిరుపతి, చల్లగురుగుల మొగిలి, పిల్లి రమేష్, సంధ్యారెడ్డి, బొడ్డుపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ డంప్‌లను సీజ్ చేసిన పోలీసులు

అంతర్గాం, మార్చి 20: మండలంలోని లింగాపూర్ గ్రామ శివారులో అక్రమంగా డంప్ చేసిన ఇసుక నిల్వలను ఎస్ఐ వెంకటస్వామి ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం సీజ్ చేశారు. విశ్వసనీయ వర్గాల ద్వారా అందించిన సమాచారం మేరకు రెవెన్యూ, మైనింగ్ అధికారులతో కలిసి లింగాపూర్‌ను సందర్శించిన ఎస్ఐ సుమారు 140 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక అక్రమ రవాణా చేసిన డంప్ చేసిన కఠిన చర్యలు తీసుకోనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రెడ్డి, మైనింగ్ అధికారి వెంకటగిరి, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో అక్రమ నిర్మాణాల తొలగింపు


అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

జ్యోతినగర్, మార్చి 20 : ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్ సమీపంలోని సర్వీసు రోడ్డులో ఉన్న అక్రమ నిర్మాణాలను బుధవారం రామగుండం కార్పొరేషన్ అధికారులు తొలగించారు. ఎన్టీపీసీ గ్రీన్‌బెల్ట్ పరిధిలో సర్వీసు రోడ్డులో అక్రమంగా నిర్మించిన కట్టడాలను మున్సిపల్ సిబ్బంది జేసీబీతో తొలగించారు. గ్రీన్‌బెల్ట్‌లో నిర్మించిన నిర్మాణాలను తొలగించాలని ఇప్పటికే నోటీసులు జారీ చేసినప్పటికీ సంబంధిత షాపుల యజమానులు స్పందించకపోవడంతో మున్సిపల్ అధికారులు వాటిని కూల్చివేశారు. వారం రోజుల క్రితం కొన్ని నిర్మాణాలను తొలగించిన సిబ్బంది బుధవారం మరికొన్నింటిని తొలగించారు. కొంతమంది స్వచ్ఛందంగా ఖాళీ చేశారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి


బీజేపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి

పెద్దపల్లి రూరల్, మార్చి 20 : పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరగా గుజ్జుల రామకృష్ణారెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గుజ్జుల రామమకృష్ణారెడ్డి మాట్లాడుతూ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నాలుగు వందల సీట్లు కైవసం చేసుకుటుందని, దేశ హ్యాట్రిక్ ప్రధానిగా నరేంద్ర మోదీ అవుతారని అన్నారు. అవినీతి రహిత పాలన అందిస్తూ దేశకీర్తిని విశ్వవ్యాప్తం చేయడం ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ తిరుగులేని నేతగా ఎదిగారన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో దేశంలో 400 స్థానాలు కైవసం చేసుకుంటామని, పెద్దపల్లి పార్లమెంట్‌లో కాషాయ జెండాను ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చేతులేత్తెశాయని, బీజేపీ గాలితో రెండు పార్టీలు కొట్టుకుపోనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పర్స సమ్మయ్య, పిన్నింటి రాజు, ఠాకూర్ రాంసింగ్, పల్లె సదానందం, అక్కెపల్లి క్రాంతి, రాజవీరు, కాసనగొట్టు విజయ్, సంతోష్, ఫహీం, సదయ్య, దూలం సతీష్, కాసుల సతీష్, దొడ్ల శ్రీనివాస్, సత్తయ్య, సత్తి, నరసింహులు, మల్లయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

ఓదెల,మార్చి 20: మండలంలోని కనగర్తిలో బుధవారం గుండారం రాజయ్య(62) అనే కౌలు రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. రాజయ్య కనగరిలోని ఆరెల్లి రాములు అనే మరో రైతు చెందిన 2.20 ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని వరి సాగు చేశాడు. బుధవారం నీరు పెట్టేందుకు వెళ్లి పరిశీలిస్తుండగా కింద ఉన్న విద్యుత్ లైన్ తీగలు కాలికి తగిలి అక్కడికక్కడే చెందాడు. రెండు రోజుల క్రితం గాలి, దుమారానికి విద్యుత్ తీగలు తెగిపడి ఉంటాయని, ఎవరూ తొలగించకపోవడం వల్ల రాజయ్య కాలికి తగిలి దుర్మరణం చెందాడని గ్రామస్థులు పేర్కొంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్సై అశోక్ రెడ్డి తెలిపారు.



రాజయ్య(ఫైల్)

పెద్దపల్లిలో యువకుడు...

పెద్దపల్లిటౌన్, మార్చి 20: విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. శాంతినగర్‌కు చెందిన ఒల్లెపు ఉపేందర్(23) ఓ పాత ఇల్లు కూల్చివేసే పనికి వెళ్లాడు. విద్యుత్ సర్వీస్ వైర్‌కు తగిలి ఉపేందర్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. తోటి కార్మికుడు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి మూడేళ్ల కూతురు ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రామడుగు, మార్చి 20: మండలంలోని వెంకట్రావ్‌పల్లిలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాకేశ్ అనే యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బోయినిపల్లి మండలంలోని అనంతపల్లి గ్రామానికి చెందిన అలువాల రాకేశ్ (21), రాగుల అరవింద్ అనే యువకులు మండలంలోని గోపాల్‌రావుపేటలో పుట్టిన రోజు వేడుకలకు హాజరైనట్లు తెలిపారు. పుట్టినరోజు వేడుకలను ముగించుకొని ఇద్దరు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా వెంకట్రావ్‌పల్లి గ్రామంలోని మూలమలుపు వద్ద మోటార్‌సైకిల్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొట్టినట్లు తెలిపారు. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా 108 వాహనం ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాకేశ్ మృతి చెందాడని తెలిపారు. మృతుని తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని విద్యార్థికి తీవ్రగాయాలు

మానకొండూర్, మార్చి 20: మానకొండూర్‌లో బుధవారం ఇసుక ట్రాక్టర్ ఢీకొని విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి..మానకొండూర్ గ్రామానికి చెందిన గొల్ల చరణ్‌తేజ్ అనే విద్యార్థి పోచంపల్లిలోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదువున్నాడు. స్నేహితుడి దగ్గరికి వెళ్లి తిరిగి వస్తుండగా అన్నారం వైపు నుంచి మానకొండూర్‌కు వస్తున్న ఇసుక ట్రాక్టర్ బాలుడిని ఢీకొట్టింది. ప్రమాదంలో చరణ్‌తేజ్‌కు తీవ్రగాయాలు కాగా 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

రెండు బస్సులు ఢీ : తప్పిన ప్రమాదం

గంగాధర, మార్చి 20: గంగాధరలో బుధవారం రెండు బస్సులు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో బస్సుల్లో ఉన్నవారు ఊపిరి పీల్చుకున్నారు. గంగాధర బస్‌స్టేషన్ నుంచి కరీంనగర్ డిపోకు చెందిన బస్సు బయటకు వస్తోంది. హుజూరబాద్ డిపో బస్సు ప్రయాణికులతో బస్‌స్టాండుకు వెళ్తుండగా రెండు బస్సులు ఒకదానికొకటి బలంగా రాసుకున్నాయి. రెండు బస్సుల్లో ప్రయాణికులుండగా ఎవరికీ ప్రమాదం కాలేదు. విషయం తెలుసుకున్న కరీంనగర్ డీఎం, ఎస్‌ఐ కిరణ్‌రెడ్డిలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని బస్సులను పరిశీలించారు.

దొంగిలించిన బైక్ లభ్యం

రామడుగు, మార్చి 20 : మండలంలోని గోపాల్‌రావుపేటకు చెందిన రఘువీర్ అనే వ్యక్తికి చెందిన మోటార్‌సైకిల్ రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. కాగా బుధవారం పెగడపల్లి మండలంలోని నర్సింహునిపేటలోని క్రీడా ప్రాంగణం వద్ద బైక్ ఉందన్న సమాచారం మేరకు అక్కడికి వెళ్లి బైక్ తీసుకువచ్చినట్లు రఘువీర్ తెలిపారు.

ధర్మపురిలో బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభం



పుట్ట బంగారం కోసం స్వామి వారల సేవల ఊరేగింపు



యాజ్ఞికులు కందాలై పురుషోత్తమాచార్యులను ఆహ్వానిస్తున్న ఈవో, చైర్మన్

ధర్మపురి, మార్చి 20: ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం వేళలో మంగళవాయిద్యాలు వెంట రాగా ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, వేదపండితులు యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యుల ఇంటికి వెళ్లి ఉత్సవాలకు ఆహ్వానించారు. అనంతరం యాజ్ఞికులను ఆలయానికి తీసుకువచ్చారు. ఉత్సవాల కోసం ఆలయం పక్షాన ఈవో అర్చకులకు దీక్షావస్త్రాలు సమర్పించారు. అనంతరం లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు అంకురార్పణ, కలశ స్థాపన, ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవమూర్తులకు రక్షాబంధనం చేసిన అనంతరం నాందీముఖం, ఇదహవచనం చేసి మాతృకా పూజలు జరిపారు. స్వామి వారలకు డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, గోదావరి మహాహారతి రాష్ట్ర కో కన్వీనర్, బీజేపీ రాష్ట్ర నేత దామెర రాంసుధాకర్‌రావు పక్షాన అర్చకులు వేర్వేరుగా సొంతంగా స్వామి వారలకు పట్టు వస్త్రాలు సమర్పించారు.

● పుట్ట బంగారం కోసం స్వామి వారు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం వేళలో లక్ష్మీనృసింహస్వామి (యోగ, ఉగ్ర), వేంకటేశ్వర స్వామి వారల ఉత్సవమూర్తులను సేవలపై ఉంచి వరహాతీర్థం, పుట్ట బంగారం కోసం తీసుకెళ్లారు. సంప్రదాయ రీతిలో మంగళ వాయిద్యాలు వెంట రాగా స్వామి వారల ఊరేగింపు సేవలను చింతామణి చెరువు వద్ద నూతన వేదిక, టీటీడీ ధర్మశాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికల వద్దకు తీసుకెళ్లారు. పూజల అనంతరం అక్కడే మట్టిని తవ్వి ఆలయాలకు పుట్ట బంగారం తీసుకువచ్చారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు జరిపి స్వామివారలను దర్శనం చేసుకున్నారు. స్వామివారల సేవలను తిరిగి ఆలయాలకు తీసుకువచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఉత్సవాల్లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, జడ్పీటీసీ బత్తిని అరుణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ రాంనర్సింహరెడ్డి, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఉత్సవ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● మొదలైన భక్తుల రాక

ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవా కోసం భక్తుల రాక బుధవారం రాత్రి నుంచి మొదలైంది. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 21న గురువారం జరిగే లక్ష్మీనృసింహస్వామి (యోగ, ఉగ్ర),వేంకటేశ్వర స్వాముల కల్యాణోత్సవం తిలకించే భక్తులు నెత్తి మీద ముల్లెమూట పెట్టుకుని చేరుకున్నారు. నిజామాబాద్ జిల్లా నుంచి కాలినడకతో చేరుకున్న భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో తమ ఇష్టదైవమైన లక్ష్మీనర్సింహస్వామిని కొలుస్తూ దర్శించుకున్నారు.

● బ్రహ్మోత్సవాల్లో నేడు

ఈ నెల 21న గురువారం సాయంత్రం ఆరు గంటలకు గోధూళి సుముహూర్తమున శేషప్ప కళావేదిక పైన లక్ష్మీనృసింహస్వామి (యోగ, ఉగ్ర), వేంకటేశ్వర స్వాముల కల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. శేషప్ప కళావేదికపై రాత్రి ఎస్‌వి శ్రీరాంభట్టార్ భాగవతార్‌చే హరికథ గానం ఉంటుందని ఆయన వివరించారు.

అక్రమంగా మద్యం, గుడుంబా రవాణాపై ఫిర్యాదుకు కంట్రోల్‌రూం

కరీంనగర్ క్రైం, మార్చి 20: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అక్రమంగా మద్యం, గుడుంబా, గంజాయి, కల్తీకల్లు దందాలపై సమాచారం లేదా ఫిర్యాదు చేసేందుకు కరీంనగర్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఎక్కడ అక్రమంగా మద్యం, గుడుంబా, కల్తీకల్లు, గంజాయి విక్రయాలు, వినియోగంపై సమాచారం ఉన్నా ప్రజలు నేరుగా కంట్రోల్ రూం నంబర్ : 8712658804కు సమాచారం అందించాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో అక్రమ మద్యం, ఇతర అక్రమ దందాల నియంత్రణకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటామని ఏసీ తెలిపారు.

చెక్ పోస్ట్ వద్ద నగదు పట్టివేత

తంగళ్లపల్లి, మార్చి 20: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా సరిహద్దుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. బుధవారం తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల చెక్‌పోస్ట్ రూ.80 వేల 400 నగదును పోలీసులు పట్టుకున్నారు. పెద్దపెల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్‌కు చెందిన రాయికంటి వేణు వేములవాడకు కారులో వెళ్తుండగా జిల్లా సరిహద్దులోని చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలూ లేకపోవడంతో రూ. 80,400 స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్ట్ అధికారులు తెలిపారు.

మద్యం పట్టివేత

జమ్మికుంట రూరల్, మార్చి 20: జమ్మికుంట మండలంలోని అంకూసపూర్ గ్రామంలో గల బెల్ట్‌షాపులపై బుధవారం పోలీస్‌లు దాడులు నిర్వహించారు. ఓదెల శ్రీనివాస్ వద్ద రూ.1400 విలువ గల మద్యం బాటిళ్లు, శామంతుల సదానందం వద్ద రూ.2600 విలువ గల మద్యం బాటిళ్లను పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.



ద్విచక్రవాహనం దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

తంగళ్లపల్లి, మార్చి 19: ద్విచక్రవాహనం దొంగతనం చేసిన తంగళ్లపల్లి మండలం మండపల్లి గ్రామానికి చెందిన అల్లేపు నవీన్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలంలోని ఒగులాపూర్ గ్రామంలో సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా జాతరకు వచ్చిన సిరిసిల్ల పట్టణం ఇందిరానగర్ కాలనీకి చెందిన పెంట శ్రీనివాస్ తన ద్విచక్ర వాహనం పార్కు చేసి రాత్రిపూట నిద్రిస్తున్న సమయంలో చోరీకి గురైంది. దీనిపై ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్న క్రమంలో ఎస్‌ఐ వాహనాల తనిఖీ చేస్తుండగా దొంగిలించిన ద్విచక్ర వాహనం పట్టుబడింది. ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని చోరీకి పాల్పడిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

మల్యాల, మార్చి 20: ఒంటరితనం భరించలేక ఓయువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నూకపల్లికి చెందిన సైదులు వంశీ(23)కి రెండేళ్ల క్రితం వివాహం జరగగా మనస్పర్థలతో ఏడాది క్రితం విడాకులు అయ్యాయి. అప్పటి నుంచి వంశీ ఒంటరితనంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. బుధవారం ఉదయం వంశీ తండ్రి రాజయ్య గదిలోకి వెళ్లి చూడగా ఉరివేసుకొని మృతి చెంది ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఆర్ కృష్ణకుమార్ కేసు నమోదు చేశారు.

బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోగ గోవర్ధన్

కోరుట్ల, మార్చి 20 : బీడీ కార్మికుల సమస్యలపై యాజమాన్యం దృష్టి సారించాలని, బీడీ టేకేదారులకు కమీషన్ పెంచే విధంగా యాజమాన్య సంఘం చర్యలు చేపట్టాలని బీడీ వర్కర్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోగ గోవర్ధన్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా బీడీ వర్కర్స్ యూనియన్ సభ్యులకు బుధవారం నోటీసులను అందించారు. అనంతరం కోరుట్ల పట్టణంలోని సి ప్రభాకర్ భవనంలో ఏర్పాటు చేసిన బీడీ కార్మిక సంఘ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోగ గోవర్ధన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు మాట్లాడారు. నిజామాబాదు, కరీంనగర్, ఆదిలాబాదు, వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని బీడీ పరిశ్రమల్లో పనిచేస్తున్న ఏడు లక్షల మంది కార్మికులు చాటన్ ప్యాకింగ్ నెలవారీ ఉద్యోగులకు రెండు సంవత్సరాల వేతన ఒప్పంద కాలపరిమితి మార్చి 31తో ముగుస్తుందన్నారు. ప్రస్తుతం రోజురోజుకు ధరలు పెరిగిపోయినందున బీడిలకు మూల వేతనం రూ. 300 పెంచాలన్నారు. బీడి టేకేదారులకు కమీషన్ పెంచి వారి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీడీ పెడరేషన్ సంఘం నాయకులు



బీడీ యజమానుల సంఘు నాయకులకు నోటీసులు అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

భానుప్రసాద్, ఎండీ ముక్రం, శ్రీనివాస్, అదే రంగారెడ్డి, అనసూయ, కొక్కుల శాంత, శంకర్, మల్లారెడ్డి, రవి వెంకన్న, సాంబయ్య, నరసయ్య, భూమయ్య, రాజేశం, లక్ష్మణ్, పరందాం, రమేష్, లింగం, బాపురావు, శంకర్, శేఖర్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫలించిన మొగిలిపేట రైతుల భగీరథ ప్రయత్నం




గంగనాల ప్రాజెక్ట్ వద్ద బండరాళ్లను తొలగిస్తున్న రైతులు



మొగిలిపేటకు చేరుకున్న గంగనాల ప్రాజెక్టు నీరు

మల్లాపూర్, మార్చి, 20: మండలంలోని మొగిలిపేట గ్రామానికి గంగనాల ప్రాజెక్ట్ నీరు తీసుకరావడానికి రైతులు నలభై రోజులుగా భగీరథ ప్రయత్నం చేసి సాధించుకున్నారు. ఇబ్రహీంపట్నంలోని గంగనాల ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా వచ్చే నీరుతోనే గ్రామంలోని పంటల సాగు జరుగుతుంది. కానీ గత కొంత కాలం నుంచి గ్రామానికి తాగు, పంట సాగుకు ఇబ్బందులు ఏర్పడి పంటలు ఎండిపోయే స్థితికి వచ్చాయి. గంగనాల ప్రాజెక్ట్ నీరు వస్తేనే గ్రామంలో సమస్యలు తీరుతాయని రైతులు భావించారు. దీంతో ప్రాజెక్ట్ నుంచి గ్రామానికి నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో చేసేది లేక గ్రామంలోని రైతులు అంతా ఒక్కటై గంగనాల ప్రాజెక్ట్ నుంచి నీరు తీసుకరావడానికి పూనుకున్నారు. గంగనాల ప్రాజెక్ట్ వద్ద పూడిక పనులు చేయకుంటే నీరు సరఫరా కాదని భావించారు. రైతులందరూ కలిసి నలభై రోజులుగా భగీరథ దీక్షలాగా పనులు చేపట్టారు. ప్రాజెక్ట్‌లోని మట్టిని, రాళ్లను తొలగించడమే కాకుండా కాలువ వెంట పెరిగిన పిచ్చి మొక్కలు, పూడిత తీత పనులు చేశారు. వారి ప్రయత్నం ఫలించి కాలువ ద్వారా గ్రామంలోని చెరువులోకి నీరు చేరుకుంది. నీటి సమస్యలు రాక ముందే అధికారులు గంగనాల ప్రాజెక్ట్ కాలవ లైనింగ్ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.







రూ.7,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మార్చి 20: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,700 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 58మంది రైతులు 773 క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 12క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,700, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

బీఫార్మసీ పరీక్ష రుసుం గడువు

గణేశ్‌నగర్,మార్చ్ 20: ఎస్.యూ పరిధిలోని బి.ఫార్మసీ మూడు, ఐదవ సెమిస్టర్ (రెగ్యులర్‌సప్లిమెంటరీ), నాలుగు, ఆరో సెమిస్టర్ (సప్లిమెంటరీ) పరీక్ష రుసుం ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించడానికి 30వ తేదీ తుది గడువు అని 300/- ల అపరాధ రుసుం తో ఏప్రిల్ 3వ తేదీ లోపు చెల్లించాలని ఎస్ యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్ వి శ్రీ రంగ ప్రసాద్ తెలిపారు.పరీక్షలను ఏప్రిల్ నెలలో నిర్వహించనున్నారు.

మద్యం కట్టడికి తనిఖీలు ముమ్మరం

● ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

కరీంనగర్ క్రైం, మార్చి 20 : లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా అక్రమం మద్యం, గుడుంబా నిల్వ, సరఫరాలపై నిఘా పెట్టామని, అక్రమ మద్యంకు సంబంధించిన సమాచారాన్ని ఎక్సైజ్ శాఖ టోల్‌ఫ్రీ నెంబరు 1800-425-2523, కరీంనగర్ కంట్రోల్‌రూం 8019263862లకు సమాచారం అందించాలని కరీంనగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. గుడుంబా నియంత్రణ కోసం గ్రామీణ ప్రాంతాలలో తనిఖీలు ముమ్మరం చేశామని తెలిపారు. మద్యం, గంజాయి, గుడుంబా అక్రమ దందాలను అరికట్టేందుకు విస్తృత దాడులు జరుపుతున్నామన్నారు. అనుమానితులను బైండోవర్ చేసి, మళ్లీ నేరాలకు పాల్పడితే తహసీల్దార్ వద్ద జరిమానా విధించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ పోలీసు శాఖలో ఇంటిలిజన్స్ టీంలను కూడా ఏర్పాటు చేశామన్నారు. తరచుగా వాహనాల తనిఖీలు, పెట్రోలింగ్ కుడా నిర్వహిస్తున్నామన్నారు.

నిలిపి ఉంచిన వ్యాన్ చక్రాలు చోరీ

శంకరపట్నం, మార్చి 20: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలోని కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి పక్కన నిలిచిన ఓ వ్యాన్ ముందు చక్రాలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడు ఎరడపల్లి గ్రామానికి చెందిన భూతం సంపత్ జీవనోపాధి కోసం తాడికల్ గ్రామంలో పాత ఇనుప సామాను వ్యాపారం చేస్తున్నాడు. బుధవారం తెల్లవారు జామున చూసేసరికి సుమారు రూ. 50వేల విలువ చేసే తన డీసీఎం వ్యాన్ ముందు చక్రాలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

పెట్రోలులో నీళ్లు వచ్చాయని ఆందోళన

ఎల్లారెడ్డిపేట, మార్చి 20: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామ శివారులోని భారత్ పెట్రోలు బంక్‌లో పెట్రోల్‌లో నీళ్లు వచ్చాయని వాహనదారులు బుధవారం ఆందోళనకు దిగారు. బాధితుల కథనం మేరకు.. గుం డారంకు చెందిన ఇద్దరు తమ వాహనాల్లో పెట్రోలు అయిపోవడంతో బాటిళ్లలో తీసుకెళ్లేందుకు బంక్‌కు చేరుకున్నారు. బాటిళ్లలో పెట్రోలు పోయించుకుని వాహనం వద్దకు వెళ్లగా అడుగు భాగంలో నీళ్లలాగా కనిపించింది. దాంతో బంక్‌కు వెళ్లి నిర్వాహకులను ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆందోళనకు దిగారు. ఇదేమిటంటూ నిలదీశారు. కల్తీ పెట్రోలు వల్ల తమ వాహనాలు చెడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు బంకుల్లో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెళ్లి విందులో పరస్పర దాడి

● కేసు నమోదు చేసిన పోలీసులు

మెట్‌పల్లి రూరల్, మార్చి, 20: మండలంలోని ఆత్మకూర్ గ్రామంలోని పెళ్లి విందులో జరిగిన పరస్పర దాడిలో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. బుధవారం గ్రామానికి చెందిన అమ్మాయికి వేములవాడకు చెందిన అబ్బాయితో కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో ఘనంగా వివాహం జరిపించారు. అనంతరం జరిగిన విందులో అబ్బాయి తరుపున బంధువులకు భోజనం పెట్టడడం లేదని నిలదీశారు. దీంతో ఇరు వర్గాల మధ్య గొడవ జరిగి పలువురికి గాయలయ్యాయి. దీంతో అమ్మాయి తరుపు బంధువు దుద్దిళ్ల తిరుపతి అబ్బాయి తరుపు ఏడుగురిపై, అబ్బాయి తండ్రి నారాల రాజు అమ్మాయి తరుపు తొమ్మిది మందిపై ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేంపేటలో మద్యం పట్టివేత

మెట్‌పల్లి మండలంలోని వేంపేట గ్రామానికి చెందిన పల్లి శేఖర్‌గౌడ్ బెల్ట్ షాప్ నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. 4లీటర్ల మద్యం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

సంక్షిప్త సమాచారం

● ముత్తారం : మండలంలోని అడవి శ్రీరాంపూర్, ఓడేడు, ముత్తారం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంథని సీఐ వెంకటేశ్వర్లు బుధవారం పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. కేంద్రాలలో పోలింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్సై మధుసూదన్‌రావుకు సూచించారు. అలాగే సిబ్బందితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

● రామగిరి : మండలంలోని కల్వచర్లకు చెందిన అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేండ్ల స్వరూప(47) బుధవారం గుండెపోటుతో మృతిచెందింది. కొంతకాలంగా అనారోగ్య కారణాలతో వరంగల్‌లోని ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గుండెపోటు రావడంతో మృతిచెందింది. అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేసే స్వరూప నవంబరులో గ్రేడ్-2 సూపర్‌వైజర్‌గా పదోన్నతి పొందింది. కాగా, రేండ్ల స్వరూప కుటుంబ సభ్యులు, బంధువులకు శ్రీపాద బంధం నాయకులు వేదాంతం పవన్‌కుమార్, ఆదిత్యల ఆధ్వర్యంలో ఉచిత అన్నసంతర్పణ నిర్వహించారు.

● ఓదెల : గ్రామీణ ప్రాంతాల్లో కనుమరుగవుతున్న ఊర పిచ్చుకలను కాపాడుకోవాలని డిప్యూటీ తహసిల్దార్ అనిల్ కుమార్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్వీఎస్ పాఠశాలలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ పర్యావరణంలో ప్రతి ప్రాణికి జీవించే హక్కు ఉందని తెలిపారు. సెల్ టవర్ల రేడియేషన్ ప్రభావంతో కొన్ని జీవులు అంతరించిపోతున్నాయని తెలిపారు. అనంతరం అధికారికి మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవకి, సదాశివ ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి మేర్గు భీష్మచారి, మండల అధ్యక్షుడు వేణు, అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి క్యాతం వెంకటేశ్వర్లు, సారంగం, మల్లేశం, తుమ్మ మధుకర్, అల్లం సతీష్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● ఓదెల : అలుగునూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కేంద్రంలో 9వ, తరగతి లోకి ప్రవేశానికి ఆన్ లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పాఠశాలలో బాల, బాలికలకు 160 సీట్లు ఉన్నాయని, పాఠశాలలో ఐఐటి, నీట్, ఫౌండేషన్ కోర్సులల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని, ఈనెల 23 వరకు దరఖాస్తులను నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

● ఓదెల : నెలక్రితం మండల పరిషత్ వైస్‌ఎంపీపీగా ఎన్నికైన జీల తిరుపతిని బుధవారం మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ ఛైర్మన్ ఆళ్ళ శ్రీనివాస్ రెడ్డి, బోడుకుంట నరేష్, కనికి రెడ్డి సతీష్, మ్యాడగోని శ్రీకాంత్, చింతమొగిలి, తీర్థాల కుమార్, చింతం వెంకటస్వామి, మార్కెట్ మాజీ డైరెక్టర్ బుద్దే కుమార్, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, నాగపురి పైడిద్దరాజు తోపాటు పలువురు పాల్గొన్నారు.

● అంతర్గాం : భగత్‌సింగ్ వర్ధంతి సభలను ఈనెల 15 నుంచి 30వరకు గ్రామాల్లో జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అనుబంధ ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) నాయకుడు బొంతు ఆనంద్ అన్నారు. బుధవారం రామగుండం పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద భగత్‌సింగ్ వర్ధంతి సభల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా భగత్‌సింగ్ ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేరుగు చంద్రయ్య, కొల్లూరి మల్లేష్, నల్లతీగల రమేష్, దూలం సతీష్, గొట్టె తిరుపతి, సాగర్ పాల్గొన్నారు.

● కళ్యాణ్‌నగర్ : తెలంగాణ జాతి గర్వించే పేరు ఈటల రాజేందర్ అని బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. బుధవారం ఈటల రాజేందర్ జన్మదిన కార్యక్రమంలో సంధ్యారాణి పాల్గొని ఈటల రాజేందర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

● సుల్తానాబాద్ : మండలంలోని దుబ్బపల్లి వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో కాట్నపల్లికి చెందిన అనుష్క(17) మృతిచెందింది. ఇటీవల కరీంనగర్‌లోని తన చిన్నాన్న ఇంటికి వెళ్లింది. తిరిగి కాట్నపల్లి వెళ్లేందుకు చిన్నాన్న కుమారున్ని దింపమని కోరింది. ఆయన అనుష్కను ఎక్కించుకుని స్కూటీపై వస్తుండగా వెనుక నుంచి లారీ ఢీట్టింది. కింద పడిన అనుష్క తలపై నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందిందని ఎస్సై శ్రావణ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

● కమాన్‌పూర్ : మండలంలోని దాసరిపల్లి గ్రామంలో బుధవారం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాకారులు జనగామ రాజనర్సు, ఈదునూరి పద్మ, బుర్ర శంకర్‌గౌడ్, కొంద్ర వెంకన్నగౌడ్, ఇల్లందుల మల్లేశంగౌడ్, నలేంద్ర రాజన్న, జిన్నా రమా, కన్నూరి రేణుక, శ్రీవల్లి తదితరులు ఉన్నారు.

● కమాన్‌పూర్ : మండల కేంద్రంలో ఆదివరహాస్వామి దేవాలయానికి బుధవారం వన్ వరల్డ్ వన్ పీపుల్స్ వ్యవస్థాపకుడు లక్ష్మీనారాయణ ప్లేట్స్, గ్లాసులను, కిచెన్ స్టాండును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గాండ్ల మోహన్, మండల ప్రధాన కార్యదర్శి మల్యాల తిరుపతి, చందు లక్ష్మీ, సంతు, కోలేటి రమేస్ తదితరులు ఉన్నారు.

ఊపందుకున్న ఉపాధి పనులు

- గ్రామాల్లో పెరుగుతున్న కూలీల సంఖ్య
- క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ


కుర్మపల్లిలో చెరువు పూడికతీత పనులు


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్

పెద్దపల్లి రూరల్, మార్చి 20 : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా మండల వ్యాప్తంగా ఉపాధి పనులు ఊపందుకున్నాయి. కూలీలు, రైతులు, పురుషులు, మహిళలు, యువకులు ఉపాధి పనులకు ఉదయం సమయంలో వెళ్తున్నారు. ప్రస్తుతం ఉపాధిహామీ పథకంలో రోజురోజుకు పెరుగుతూ వస్తుంది. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేకపోవడంతో పలువురు ఉపాధి పనిచేసేందుకు ముందుకొస్తున్నారు. అలాగే జాబ్‌కార్డు ఉన్న కూలీలందరూ ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలపి అధికారులు గ్రామాల వారిగా అవగాహన కల్పించారు. గ్రామసభలు ఏర్పాటు చేసి చేపట్టే పనులకు ప్రణాళికలు తయారు చేశారు. మండలంలో 14వేల 490 జాబ్ కార్డులు ఉన్నాయి. మొత్తం 31వేల 75మంది కూలీలు ఉన్నారు. వీటిలో 10 564 ఆక్టివ్ కార్డులు ఉండగా 18 వేల 76మంది కూలీలు ఏటా పనికి వెళ్తున్నారు. ఉదయం పూట 100 నుంచి 200 లోపు కూలీలు పనులకు వెళ్తున్నారు. చిన్న గ్రామపంచాయతీల్లో వందకుపైగా కూలీలు హాజరవగా, పెద్ద గ్రామ పంచాయతీల్లో 150పైగా కూలీలు పనులకు వస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. ప్రతిరోజు సుమారు మండలవ్యాప్తంగా 3వేలకు పైగా కూలీలు పనులు వస్తున్నారు. ఉపాధిహామీ పథకంలో ముళ్లపొదలు, చెరువులో పూడిక, కాలువల పూడికతీత, కందకాలు, గుంతల తవ్వకాల పనులు చేపడుతున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

- ఏపీవో రమేష్ బాబు

గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలి. గతంలో కంటే కూలీల సంఖ్య ప్రస్తుతం పెరుగుతూ వస్తుంది. వ్యవసాయ పనులు అంతగా లేకపోవడంతో జాబ్ కార్డు ఉన్న వారు పనులకు వస్తున్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి.

గుంతలమయంగా కోల్‌కారిడార్ రోడ్డు

● ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు ● పట్టించుకోని అధికారులు

రామగిరి, మార్చి 20: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధీలోని సెంటినరీకాలనీ నుంచి గోదావరిఖనికి వెళ్లే కోల్‌కారిడార్ ప్రధాన రహదారి ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. వరుసగా జరుగుతున్న ప్రమాదాల్లో పలువురు మృత్యువు బారిన పడగా, పెద్దసంఖ్యలో ద్విచక్రవాహనదారులు గాయపడ్డారు. సెంటినరీకాలనీ నుంచి జూలపల్లి వరకు రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. మినిస్ట్రీ ఆఫ్ కోల్ ఆధ్వర్యంలో సీసీఅండ్‌డీఏసీ 70శాతం, సింగరేణి 30శాతం నిధులతో 2009 సంవత్సరంలో రోడ్డు పనులకు ప్రారంభమై 2015 సంవత్సరంలో జీడికె-5 ఇంక్లైయిన్ జంక్షన్ నుంచి పెద్దపల్లి-మంథని రోడ్ సెంటినరీకాలనీకి వయా పెంచికల్‌పేట్ మీదుగా కోల్‌కారిడార్ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. సుమారు 9 సంవత్సరాలుగా గోదావరిఖనికి వేళ్లేందుకు ప్రధాన రహదారిగా కాలనీ వాసులకు ఉపయోగంలో ఉంది. నిత్యం భారీవాహనాలు, ద్విచక్రవాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రోడ్డు ప్రస్తుతం గుంతలతో అధ్వానంగా మారింది. కమాన్‌పూర్ మండలం జూలపల్లి, రామగిరి మండలం సెంటినరీకాలనీకి లింకుగా ఎంతో ఉపయోగంలో ఉన్నా రోడ్డు తారు చెదిరిపోయి గుంతలుపడ్డాయి. ప్రధానరహదారిపై వెళ్లే డ్యూటీ కార్మికులు వాహన ప్రమాదాల్లో సుమారు ఐదుగురు మృత్యువాత పడగా, చాలా మంది ద్విచక్ర వాహనదారులు గాయపడ్డారు. చలికాలంలో ప్రమాదాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. చలి దుప్పటి పరుచుకోవడంతో ముందు వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. దీనికి తోడు కోల్‌కారిడార్ రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటుచేసిన లైటింగ్ సక్రమంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. భారీ గుంతలు ఏర్పడిన ప్రాంతాల్లో ఇటీవలే కొంత మేరకు ప్యాచ్ వర్క్‌లతో సింగరేణి చేతులు దులుకున్నదన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సింగరేణి నిబంధనల ప్రకారం కాలం చెల్లిన రోడ్లకు తిరిగి మరమ్మతులు జరిపించాల్సి ఉండగా అలా జరగడం లేదనే విమర్శలు కార్మికుల నుంచి వినిపిస్తున్నాయి. సోలార్ కార్యాలయం వద్ద రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. ప్యాచ్ వర్క్స్‌తో కంటితుడుపుతో సరిపెట్టుకున్న సింగరేణి కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని కార్మిక సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. కోల్‌కారిడార్ రోడ్డును పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.


గుంతలమయంగా మారిన రోడ్డు

'దాసరి ఉష వ్యాఖ్యలు అర్థరహితం'

పెద్దపల్లిటౌన్, మార్చి 20: జిల్లాలో బీఎస్పీ నాయకులు అందరు ఖాళీ అయ్యారని దాసరి ఉష చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని, బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇరికిల్ల రాజనర్సయ్య తెలిపారు. బీఎస్పీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీతో ప్రజల్లో గుర్తింపు పొందిన ఉష కన్నతల్లి లాంటి పార్టీపై అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు. ఇకపై బీఎస్పీపై అసత్య ప్రచారం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అడ్వైజర్ పేగ నరేష్, ప్రధానకార్యదర్శి మమిడిపల్లి కాంతయ్య, అర్గనైజింగ్ సెక్రెటరీ నక్క తిరుపతి, చిప్పకుర్తి శంకర్, జిల్లా మహిళ కోకన్వీనర్ కెవెల్ అనిత, పెద్దపల్లి నియెజకవర్గ అధ్యక్షుడు బోంకురి దుర్గయ్య, ఉపాధ్యక్షుడు నర్ల గోపాల్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సాతురి అనిల్, పెద్దపల్లి టౌన్ అధ్యక్షురాలు రామిళ్ల శారద పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాజనర్సయ్య

ఆత్మహత్య చేసుకుంటానని ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి

- 2 గంటల్లో గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

కరీంనగర్ క్రైం, మార్చి 20: భార్యతో గొడవపడి ఆత్మహత్య చేసుకుంటానని ఇంటిలో నుంచి వెళ్ళిపోయిన కరీంనగర్ పాతబజార్‌కు చెందిన మందపల్లి దేవయ్య(55)ను కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు 2 గంటల వ్యవధిలో ఆచూకీ కనుగొని అతన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఒకటో ఠాణా సీఐ సరిలాల్ తెలిపిన వివరాల ప్రకారం దేవయ్య బుధవారం ఉదయం 10 గంటల సమయంలో తన భార్యతో గొడవపడ్డాడు. తాను ఆత్మహత్య చేసుకుం టానని కోపంతో ఇంటి నుంచి బయటకు వెళ్ళిపోయాడు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు దేవయ్య ఫోన్‌కు కాల్ చేయగా స్విచాఫ్ వచ్చింది. వెంటనే అతని కూతురు రమ ఒకటో ఠాణా పోలీసులను ఆశ్రయించింది. ఎస్ఐ రవి ఆధ్వర్యంలో ఒక పోలీసు టీం రంగంలోకి దిగి సాంకేతిక పరిజ్ఞానంతో 12 గంటల ప్రాంతంలో దేవయ్య కరీంనగర్ శివారులోని పద్మనగర్‌లో ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకుంది. అనంతరం అతన్ని ఠాణాకు తరలించి కౌన్సెలింగ్ నిర్వహించి క్షేమంగా కూతురుకు అప్పగించారు. దేవయ్య ఆచూకీ కనిపెట్టిన ఎస్ఐ రవిని, సిబ్బందిని ఈ సందర్భంగా సీఐ సరిలాల్ అభినందించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

భగత్‌నగర్, మార్చి20: జిల్లాలో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు కోరారు. కరీంనగర్ జిల్లాలో వడగళ్ల వానతో పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఎకరాన 25 వేల రూపాయల చొప్పున అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

గిరిజన వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

గణేశ్‌నగర్, మార్చి 20: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కామ్రేడ్ ఠానూ నాయక్ స్ఫూర్తితో ఉద్యమించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు భీమా సాహెబ్ పిలుపునిచ్చారు. ఠానునాయక్ వర్ధంతిని కరీంనగర్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీమాసాహెబ్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం దేశానికే ఆదర్శమన్నారు. జనగామ ప్రాంతంలో ఆంధ్ర మహాసభ నాయకత్వంలో కమ్యూనిస్టులు రాకముందే ఆ ప్రాంతంలో దొరలు భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా గిరిజనులు పోరాడారని గుర్తుచేశారు. ప్రభుత్వ రంగం సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు.

‘లేబర్‌కార్డును సద్వినియోగం చేసుకోవాలి’

మంథని, మార్చి 20: కార్మికులు లేబర్‌కార్డును సద్వినియోగం చేసుకోవాలని సహాయ కార్మిక శాఖ అధికారి హేమలత బుధవారం కోరారు. లేబర్ కార్డు జారీ విషయంలో కార్మిక శాఖలో అవినీతి జరిగేందుకు ఆస్కారం లేదన్నారు. తమ కార్యాలయ పరిధిలో భవన నిర్మాణ, ఇతర కార్మికులకు దరఖాస్తు చేసుకునేందు సంక్షేమ పథకాల దరఖాస్తులు అన్నీ కేవలం మీసేవ ద్వారా మాత్రమే అమలు చేస్తున్నారని, ఎలాంటి మధ్యవర్తిత్వం ద్వారా దరఖాస్తు ప్రక్రియలు జరగవని ప్రజలు గమనించాన్నారు. మీసేవ ద్వారా నమోదు చేసుకొని అనంతరం అర్హులైన వారు నేరుగా మంథని సహాయ కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు నూతన దరఖాస్తు చేసుకునేందుకు రూ.110 ఫీజు మీ సేవలో చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. నమోదైన కార్మికులు 5 సంవత్సరాలు దాటకుండా పునరుద్ధరించుకోగలరని సూచించారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా కమిటీ



నర్సయ్యను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

పెద్దపల్లిటౌన్, మార్చి 20: మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాంమోహన్ ప్రకటించారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా కొలిపాక నర్సయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా బొజ్జం సారయ్య, డైరెక్టర్లుగా అయిలవేని వీరస్వామి, కందుల శ్రీనివాస్, చిట్ల శ్రీనివాస్, తాళ్ల తిరుపతి, పెద్దపల్లి సుజాత, పోతరబోయిన క్రాంతి కుమార్, పోలవేని మొండయ్య, బోయిరి శ్రీకాంత్, రేండ్ల కోటయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడిగా కొలిపాక నర్సయ్య, నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. తన ఎన్నికకు సహకరించిన డైరెక్టర్లకు అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని సంఘం సభ్యులు నర్సయ్యను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్, నాయకులు కొలిపాక చిరంజీవి, కొలిపాక సంపత్, పిడుగు సంపత్, చుంచు సదయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం డైరెక్టర్‌గా శ్రీనివాస్

పెద్దపల్లి రూరల్, మార్చి 20: జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్‌గా పెద్దపల్లి మండలంలోని హన్మంతుని పేట గ్రామానికి చెందిన కందుల శ్రీనివాస్ ఎన్నిక య్యారు. ఈ సందర్భంగా కందుల శ్రీనివాస్‌కు గ్రామ మాజీ సర్పంచ్ తీగల సదయ్యతో పాటు పలువురు ముదిరాజ్ కులస్థులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.


శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ సర్పంచ్ తీగల సదయ్య

జోన్ స్థాయి క్రీడోత్సవాలు

మంథని, మార్చి 20: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో కరీంనగర్ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మంథని బ్లాక్ స్థాయి స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు జాతీయ యువజన వలంటీర్ కన్నూరి అనిల్ కుమార్ బుధవారం తెలిపారు. యువతీ, యువకులకు కబడ్డీ, వాలీబాల్ విభాగాలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలి

పెద్దపల్లి రూరల్, మార్చి 20: గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల రక్షణకు చర్యలు చేపట్టాలని ఎంపీవో సుదర్శన్ అన్నారు. బుధవారం మండలంలోని నిట్టూరు గ్రామంలో పారిశుధ్య పనులు, శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సెగ్రిగేషన్ షెడ్డు, గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను ఎంపీవో సుదర్శన్ పరిశీలించారు. గ్రామంలోని ఇంటి పన్నులు వంద శాతం వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శి రమేష్‌కు సూచించారు.

జేఎన్టీయూలో క్రికెట్ పోటీలు

రామగిరి, మార్చి 20: మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో రెండవ రోజు బి-జోన్ స్థాయి క్రికెట్ పోటీలు బుధవారం జరిగాయి. వివిధ జిల్లాలకు చెందిన క్రికెట్ జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి సివిల్ విభాగం అధికారి పద్మరాజు ముఖ్య అతిథిగా హాజరై మణిచంద్‌కు మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రామ్ నరేష్, సతీష్, రవీకుమార్, ఫీజికల్ డైరెక్టర్ పింగిళి కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి పట్నాలు


ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మారం, మార్చి 20: ధర్మారం మండలం నర్సింహులపల్లి గ్రామంలో బుధవారం జరిగిన ఎల్లమ్మ తల్లి పట్నాల ఉత్సవాల్లో మాజీ మంత్రి, పెద్దపల్లి ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఆలయ నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార సంఘాల చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, మాజీ సర్పంచ్ అరుణ, బీఆర్ఎస్ నాయకులు పాకాల రాజయ్య, జాడి సదయ్య, దేవి రమణ, ఆవుల శ్రీనివాస్, గాండ్ల నర్సయ్య, దీటి శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి మాజీ మంత్రి పరామర్శ

ధర్మారం, మార్చి20: ధర్మారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ నాయకుడు సల్వాజీ మాదవరావును బుధవారం మాజీ మంత్రి, పెద్దపల్లి ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. జరిగిన దాడి ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మాదవరావుకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన అక్కడి వైద్యులను కోరారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వెంట వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు జడ్పీ చైర్మన్ పరామర్శ

మంథని, మార్చి 20: మండలంలోని పలు బాధిత కుటుంబాలను జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు బుధవారం పరామర్శించారు. మున్సిపాలిటీ పరిధిలోని గంగాపురి గ్రామంలో ఏగోళపు రాజేశ్వరీ, మండలంలోని లక్కేపూర్ గ్రామంలో బడికెల శాంతమ్మలు ఇటీవల మృతిచెందగా వారి చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నేతలు ఉన్నారు.



ఏఐటీయూసీ పిట్ కమిటీ పరిచయం

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 20: ఓసీపీ-3 ప్రాజెక్టు ఏఐటీయూసీ బేస్‌వర్క్‌షాప్ పిట్ కమిటీని బుధవారం సెంట్రల్ నాయకులు హెడ్ ఆఫ్‌ది డిపార్ట్‌మెంట్‌కు పరిచయం చేశారు. పిట్ సెక్రెటరీగా పూసాల సంపత్, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీలుగా కుమారస్వామి, కొంరయ్య, ట్రేడ్స్‌మెన్ కమిటీ సెక్రెటరీగా కనకయ్య, బ్రాంచి ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎస్ కృష్ణ, సేఫ్టీ కమిటీ మెంబర్ రాంకుమార్, మైన్స్ కమిటీ మెంబర్ రామయ్య, సెక్షన్ ఇంచార్జిలును పరిచయం చేశారు. ఈకార్యక్రమంలో బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, ఉపాధ్యక్షుడు అన్నారావు, బ్రాంచి అసిస్టెంట్ సెక్రెటరీలు శ్యాంసన్, సాంబశివరావు, ప్రాజెక్టు పిట్ సెక్రెటరీ ఇజ్జ రాజయ్య పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

- తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం

కోల్‌సిటీటౌన్, మార్చి 20: తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏప్రిల్ 7న జరిగే రామగుండం రీజియన్ మహాసభను కార్మికవర్గం విజయవంతం చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు గట్టయ్య, న్యాయవాది శైలజ కోరారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో వనరులను, సింగరేణి సంస్థను సంరక్షించుకోవడానికే తెలంగాణ ఉద్యోగుల సంఘం ఆవిర్భవించిందన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణిలో కార్మిక వర్గానికి జరుగుతున్న అన్యాయం, దోపిడిపై సంఘం పోరాడుతుందన్నారు. గనుల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, పబ్లిక్ రంగ సంస్థగానే కొనసాగించాలని, భూగర్భ గనులను ప్రారంభించి ఉపాధి అవకాశాలను పెంచాలని తదితర డిమాండ్లతో మహాసభ జరుగుందన్నారు. ఈ సభకు ప్రొఫెసర్ కోదండరామ్ హాజరవుతున్నారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో మిట్టపెల్లి కుమారస్వామి, జైపాల్‌సింగ్, రాయపోశం, అంజన్న, కనకన్న, భీరయ్య, శ్రీధర్, వేముల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్ పనులు త్వరగా పూర్తి చేయాలి

- సోలార్ జీఎం జానకిరామ్

రామగిరి, మార్చి 20: సౌర విద్యుత్ కేంద్రం పనులు సత్వారం పూర్తి చేయాలని సోలార్ జీఎం జానకిరామ్ అన్నారు. బుధవారం జీఎం కార్యాలయంలో ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్జీ-3 డివిజన్‌లో నూతనంగా నిర్మిస్తున్న 22 మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రం పనులు మే 15 తేదిలోగా పూర్తి అయ్యే విధంగా తగిన ప్రణాళికలతో ముందుకువెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌లకు, అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సమావేశంలో అధికారులు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, కాంట్రాక్టర్‌లు, ఉద్యోగులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జీఎం సోలార్ జానకిరామ్

జీఎం కార్యాలయంలో సమస్యలను పరిష్కరించాలి


వినతి పత్రం అందిస్తున్న పిట్ కమిటీ సభ్యులు

రామగిరి, మార్చి 20: సింగరేణి సంస్థ ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో నెలకొన్న పలు సమస్యలపై బుధవారం ఉపాధ్యక్షుడు కొట రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జీఎం పిట్ కమిటీ సభ్యులు జీఎం సుధాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. మహిళలకు ఆధునిక ఆఫీస్ ఫర్నిచర్, క్యాంటీన్‌లో ఫర్నిచర్, ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ షెడ్ పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రవికుమార్, గణేష్, మల్లిక, జ్యోతి, లావణ్య, వేద శ్రీలు పాల్గొన్నారు.

వేసవిలో ఆరోగ్య సంరక్షణపై అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 20: వేసవి కాలంలో ఆరోగ్య సంరక్షణపై ఓసీపీ-3 ప్రాజెక్టులో బుధవారం వైద్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఏరియా వైద్య అధికారి డాక్టర్ పద్మజ పలు సూచనలు చేశారు. వడదెబ్బ తగలకుండా, వడదెబ్బకు గురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వేసవిలో ఎక్కుగా నీళ్ళు తాగాలని, నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీళ్ళు ఆరోగ్యానికి శ్రేయస్కరమని అన్నారు. ఎండలో వెళ్ళినపుడు తలకు టోపీలేదా పాగా ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ రమేష్, సేఫ్టీ ఆఫీసం భరత్‌కుమార్, వెల్ఫేర్ ఆఫీసర్ సురేందర్, పిట్ సెక్రెటరీ ఎజ్జ రాజయ్య పాల్గొన్నారు.